క్లుప్తంగా

ఆంజనేయుడికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాండ్లవీధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. అర్చకులు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో అంజన్నకు ఆకుపూజ జరిపారు.

పరామర్శ



గాలాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

నందలూరు(రాజంపేట) : తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పాటూరు మాజీ సర్పంచ్ గాలా సుధాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిలు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు. వీరితోపాటు మండలనేత అన్నం నాగేంద్ర, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, పాటూరు సర్పంచ్ మోహన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సత్యాల రామకృష్ణ, బీసీ నాయకులు ఓర్సు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో మోస్తరు వర్షం



వర్షానికి నీరు నిలిచిన దృశ్యం

పెనగలూరు : మండలంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. 2023వ సంవత్సరానికి మంగళవారం కురిసిన ఓ మోస్తరు వర్షమే పంట పొలాల్లో పదునైంది. ఏప్రిల్ నుంచి జూలై 22వ తేదీ వరకు 166 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 110 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. తుఫాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుంచి ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. నక్కలకారు నాటే రైతులకు ఈ వర్షం ఎంతగానో మేలు చేసింది. ఈ ఏడాది దాదాపు 35 శాతం వర్షపాతం తక్కువగా నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.

భూ ఆక్రమణ తొలగింపు



భూ ఆక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పుల్లంపేట : మండల పరిధిలోని రామక్కపల్లి పంచాయతీలో గ్రామ కంఠానికి చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించగా గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ నరసింహ కుమార్ గ్రామకంఠ భూ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ ఆక్రమణ తొలగింపుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వీఆర్‌ఓ మల్లికార్జున, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

రాయచోటి అర్బన్ : పిల్లలు రక్తహీనత బారిన పడకుండా తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పీహెచ్‌సీ కో–ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి అన్నారు. మంగళవారం శిబ్యాల ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్య బృందం రక్తహీనత పరీక్షలు నిర్వహించింది. ఎత్తు, బరువు, రక్తహీనత శాతం పరీక్షలను నిర్వహించారు. ప్రతి విద్యార్థి ప్రతి గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను తప్పకుండా తీసుకోవాలన్నారు. తీవ్రమైన రక్తహీనత ఉన్న విద్యార్థులు వారానికి రెండు పర్యాయాలు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను వేసుకోవాలంటూ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీషా, ఏఎన్‌ఎంలు సరస్వతి, అంజనమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరవనం.. ఆహ్లాద వాతావరణం



నగరవనంలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక కుటీరం



బోద షెడ్డును వేసిన దృశ్యం

రాజంపేట : రాజంపేట పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో రాజంపేట – రాయచోటి రోడ్డులోని ఎస్ ఆర్ పాళెం సమీపంలో 50 హెక్టార్లలో విస్తీర్ణంలో నగరవనాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 6 హెక్టారులలో నగరవనాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా అటవీశాఖాధికారి వివేక్ నేతృత్వంలో పనులు ముమ్మరంగా చేస్తున్నారు. రోడ్డుకు దగ్గరగా ఉన్న నగరవనంలో వారాంతంలో రాజంపేట తదితర ప్రాంతాల వాసులు సరదాగా గడిపేందుకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులు ఉల్లాసంగా గడిపేందుకు చిల్డ్రన్ పార్కు, క్యాంటిన్‌తోపాటు అటవీ వాతవరణం కల్పించే విధంగా నగరవనం సుందరంగా రూపుదిద్దుకుంటోంది.



సిద్ధమవుతున్న నగర వనం

మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి



సంఘీభావ ప్రదర్శనను నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : ప్రజల మధ్య చిచ్చుపెట్టి దారుణ మారణహోమానికి కారణభూతమైన మణిపూర్ రాష్ట్రప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్రకార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో పలు సంఘాల నేతలు మణిపూర్ సంఘటన బాధితులకు మద్దతుగా సంఘీభావ ప్రదర్శనను నిర్వహించారు. ప్రదర్శన స్థానిక అంబేడ్కర్ చిత్రపటం నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా నేతాజీ సర్కిల్ వరకు సాగింది. ప్రదర్శనలో మణిపూర్ అత్యాచార దుండగులను కఠినంగా శిక్షించాలి, మతోన్మాదాన్ని తరిమికొడతాం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మణిపూర్‌లో హింసను అదుపుచేయడంలో అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. మణిపూర్ ఘటనలపై కేంద్రం పెద్దగా స్పందించడం లేదన్నారు. పార్లమెంటులో విపక్షాలు పెద్దఎత్తున ఆందోళనకు దిగినా కేంద్రపాలకులు పెదవి విప్పకపోవడం దారుణమన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం మణిపూర్ ప్రభుత్వ పెద్దలే అక్కడున్న తెగల ప్రజల నడుమ తగాదాలు పెట్టి పెంచిపోషిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే మణిపూర్ సీఎం బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్, ఎస్.రామచంద్ర, రమేష్ బాబు, డి.సి.వెంకటయ్య, సగీర్, చెన్నక్రిష్ణ, సిద్దమ్మ, నాగమణి, విజయమ్మ, రమణా రెడ్డి, హరిప్రసాద్, బాబు, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి



ఉపాధి పనుల తనిఖీలో పాల్గొన్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం చేపట్టిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా ఉపాధి పనుల పీడీ మద్దిలేటి మంగళవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న గృహాలకు ఇచ్చే 90 రోజుల పని వేతనం, ఉద్యాన పంటల ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. 18వ విడతలో మండలంలో 22–23 ఆర్థిక సంవత్సరానికి గాను 1443 పనులు చేపట్టినట్టు తెలిపారు. ఇందుకుగాను వేతనాల రూపంలో రూ.8.46 కోట్లను చెల్లించినట్లు తెలిపారు. ఉపాధి పనులు నాణ్యతగా చేయాలని తెలిపారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు చేపట్టాలని సూచించారు. ఏపీఓ ప్రకాష్, ఏపీ శివప్రసాద్, ఏపీడీ ప్రతాప్, ఏపీఓ ఉమామహేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రతి కుటుంబానికి రక్ష



లబ్ధిదారులకు సరిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : జగనన్న సురక్ష అనేది ప్రతి కుటుంబానికి రక్షగా ఉంటుందని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ సింగం నీలకంఠారెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, అర్హులైన కుటుంబాలకు చేరవేసే విధంగా గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామ సచివాలయం ద్వారా లబ్ధిదారులకు మంజూరైన 11 రకాల సర్టిఫికెట్లను అధికారులు, మండల కన్వీనర్, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దారు లక్ష్మీదేవి, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, వీఆర్‌ఓలు చంద్ర, కేశవ్, వైస్ ఎంపీపీ శ్రీనివాసుల రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు తదిరతులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న స్పెషలిస్టు వైద్యులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో ఆద్యా మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం తిరుపతికి చెందిన స్పెషలిస్టు వైద్యులచే రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. రక్తపరీక్షలు, ఈసీజీలను ఉచితంగా చేశారు. అలాగే ఎముకలు, కీళ్లు, ఊపిరితిత్తులు, షుగర్, దంతాల వైద్య సేవలను అందించారు. దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. వైద్యులు రామాంజనేయులు, శ్యామ్, తిరుపతి స్పెషలిస్టు వైద్యులు ఎం.కుమార్, రమణ, వినూత్న, దివ్య, ఆరోగ్యకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదును పక్కాగా చేపట్టాలి



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

రామాపురం : ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలని అన్నమయ్య జిల్లా ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం బీఎల్‌ఓలు, అధికారులతో నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు జరుగుతున్న ఓటరు జాబితా నమోదులో అర్హులైన 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులను ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు ఓటరు నమోదు చేసేటప్పుడు వారి ఆధారాలు చూసుకొని వాటిని తప్పులేకుండా ఓటరు నమోదు చేయాలన్నారు. ఓటర్ కార్డులపై ఇంటి నెంబర్లు జీరోగా ఉన్నాయని దానిని సవరించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లితే సమాచారంతోపాటు అన్ని వివరాలను ఓటరు వద్దనే తెలుసుకోవచ్చునన్నారు. దొంగ ఓట్లు నమోదైన వారి జాబితాను అధికారికంగా గ్రామాల్లో విచారించి ఆ ఓటరులను తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఆర్ఐ రవికుమార్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామంలో సోమవారం పేకాట ఆడుతున్నవారిని అదుపులోకి తీసుకొన్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారం మేరకు శెట్టిపల్లె గ్రామ పరిధిలోని ఓ ప్రాంతంలో పేకాటాడుతున్న స్థావరంపై తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులకు మంగళవారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, రాజంపేట శాఖ ప్రతినిధులు పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు గూనిపూటి యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకుడు సనిశెట్టి నవీన్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశాడు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. క్లబ్ ప్రతినిధులు పబ్బతి జగన్, బవిరిశెట్టి యశ్వంత్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాజాశరత్‌బాబు, యలకంటి అవినాష్ పాల్గొన్నారు.

డీఈఓపై ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న పిల్లి రామకృష్ణ

రాజంపేట టౌన్ : వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డిపై తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాఘవరెడ్డి అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారిగా కూడా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అలాంటి అధికారిపై రాంభూపాల్‌రెడ్డి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాంభూపాల్‌రెడ్డి డీఈఓపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్టీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఎస్టీయూ నాయకులు వై.సుబ్రమణ్యంరాజు, జి.ఆదినారాయణరెడ్డి, టీవీ రమణయ్య, ఎన్.గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, జి.నాగరాజు, నరసింహ, ఎంవీ సుబ్బారెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

లక్కిరెడ్డిపల్లె/రాయచోటి అర్బన్/చిన్నమండెం/రైల్వేకోడూరు : విద్యార్థి సంఘాలు మంగళవారం పిలుపునిచ్చిన పాఠశాలల బంద్ రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు పరిధిలో విజయవంతమైంది. ఈ సందర్భంగా బంద్ చేపట్టిన ఏఐఎస్‌ఎఫ్, టిఎన్‌ఎస్‌ఎఫ్, ఏఐఎస్‌బీ, ఏపీఎస్‌ఎఫ్, ఆర్‌ఎస్‌యూ, పీఆర్‌ఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. విద్యా వ్యవస్థ బలపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్యార్థలకు మధ్యాహ్న భోజనంతో పాటు హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీ దోపిడీని అరికట్టాలన్నారు. డిగ్రీ పాత విధానాన్ని కొనసాగిస్తూ, జీఓ నెంబరు 77ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

27న జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : మదనపల్లె మిషన్ కాంపౌండ్‌లో ఈనెల 27న జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు.

సేవకు సలాం



కుటుంబాలకు చేదోడుగా ఉంటూ..



కరోనా సమయంలో రూ. వెయ్యి ప్రభుత్వ సాయాన్ని అందిస్తున్న వలంటీర్ చక్రవర్తి శివాజీ

మనం చూస్తున్న ఈ చిత్రం సిద్దవటం మండలం దిగువపేటలో వలంటీర్‌గా సేవ చేస్తున్న చక్రవర్తి శివాజీది. కరోనా సమయంలో ప్రజలకు నిత్యావసరాలకు ఇబ్బందులు కలుగకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రూపాయాలు అందించింది. వలంటీర్ శివాజీ తన పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ సాయాన్ని అందించడమే కాక ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి చేరవలసిన సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూస్తూ వారికి చేదోడువాదోడుగా నిలిచాడు. అలానే కరోనా సమయంలో వైద్య సిబ్బంది సహకారంతో ప్రజలకు జాగ్రత్తలను తెలియజేస్తూ, కరోనా కేసుల గుర్తించి, వారికి వైద్య సేవలందించడంలో విశేష సేవలు చేశాడు. దీంతో వలంటీర్ల సేవలకు ప్రజలు సలాం కొడుతున్నారు.

– సిద్దవటం

ఆర్థికంగా మేలు జరిగింది



ఉన్న ఫలంగా ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించడంతో డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాం. మా వలంటీర్ చక్రవర్తి శివాజీ తలుపు తట్టి రూ. వెయ్యి ఇచ్చాడు. ఎందుకని అడిగితే పేదల కోసం ప్రభుత్వం నగదు మంజూరు చేసిందని చెప్పాడు. దీంతో కొంత వరకు ఆర్థికంగా ఉపశమనం పొందాను. కోవిడ్ సమయంలో వలంటీర్ చేసిన సేవలు మరువలేనివి.

– పి. భరత్‌కుమార్, దిగువపేట, సిద్దవటం

ప్రాణాలను సైతం లెక్క చేయకుండా



కాలు దెబ్బతిన్న వితంతువు కొండమ్మకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ రామకృష్ణయ్య

ఇతని పేరు పాల రామకృష్ణయ్య. రాజంపేట మండలం గుండ్లూరు పంచాయతీ కోనరాచపల్లి గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వలంటీర్‌గా సేవా హృదయంతో సేవలందిస్తుండడంతో ఇతని సేవలను ఆ క్లస్టర్ పరిధిలోని వారు కొనియాడుతున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఇతను చేసిన సేవలు మరువరానివని అక్కడి ప్రజలు తెలిపుతున్నారు. అకాల వరదలు సంభవించినపుడు ఇతను ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాత్రి, పగలు తేడా లేకుండా సేవలు అందించాడు. తన పరిధిలోని రామాపురానికి చెందిన వితంతువు ఈరి కొండమ్మకు 4 నెలల క్రితం కాలు విరిగింది. దీంతో ఆమె రైల్వేకోడూరు మండలంలోని అటవీ శివారు ప్రాంతమైన కన్నెగుంటలో బంధువుల వద్ద ఉంటోంది. ప్రతి నెల అక్కడికి వెళ్లి రామకృష్ణయ్య పింఛన్ అందిస్తుండడం అందరూ ప్రశంసించేలా చేస్తోంది. అదే సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఫాతిమాకు కొండమ్మ పరిస్థితి రామకృష్ణయ్య తెలియజేయటంతో ఆమె పెద్ద మనసుతో రూ.8 వేలు రామకృష్ణయ్యకు ఇచ్చి కొండమ్మకు అందజేసేలా చేయడంతో అందరూ వలంటీర్‌ను అభినందిస్తున్నారు.

– రాజంపేట రూరల్

నా తోబుట్టువుగా..



వలంటీర్ రామకృష్ణయ్య నాకు తోబుట్టువుగా నిలుస్తూ ఆదుకుంటున్నాడు. కదలలేని స్థితిలో ఉన్న నాకు ఏమి ఆశించకుండా ఇంత దూరం వచ్చి ఫించన్ అందిస్తున్నాడు. నా కష్టం తెలియజేసి ఇతరులు ఇచ్చిన సొమ్మును కూడా నాకు తెచ్చి ఇచ్చి నాకు తమ్ముడిలా అండగా ఉన్నాడు. మా గ్రామంలో అందరికీ ఉపయోగపడే రామకృష్ణయ్య కుటుంబం ఎల్లప్పుడూ చల్లగా ఉండాలి.

– ఈరి కొండమ్మ, గుండ్లూరు గ్రామం, రాజంపేట మండలం

మొహర్రం వేడుకలను సామరస్యంగా జరుపుకోండి



మాట్లాడుతున్న రాయచోటి రూరల్ సీఐ లింగప్ప

చిన్నమండెం : హిందూ, మహమ్మదీయ సోదరులు కలిసి జరుపుకుంటున్న మొహర్రం వేడుకలను సామరస్యంగా జరుపుకోవాలని రాయచోటి రూరల్ సీఐ ఎస్.లింగప్ప పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీర్లమకాన్ వద్ద ఎస్ఐ డి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో మొహర్రం కమిటీ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ లింగప్ప మాట్లాడుతూ మండలంలో జరుపుకుంటున్న మొహర్రం వేడుకలను సోదరభావంతో సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఈ నెల 28, 29వ తేదీలలో జరిగే వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వరాదని చెప్పారు. ఇందుకోసం పలువురు పోలీసు సిబ్బందితో పకడ్బందీగా చర్యలు చేపడుతామని తెలిపారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్ఐ రమేష్ బాబు, ముస్లిం మత పెద్దలు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటిలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : మొహర్రం పండుగ అంటేనే మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని అందుకే కలసిమెలసి మొహర్రంను జరుపుకోవాలని నిర్వహణ కమిటీ సభ్యులకు ఎస్ఐ సూచించారు. మంగళవారం వీరబల్లె పోలీస్ స్టేషన్ ఆవరణలో మొహర్రం కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం నిర్వహణలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల రికార్డులు అందరికీ తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్ఐ చంద్రమోహన్

వీరబల్లె (రాయచోటిటౌన్) : రికార్డులు సక్రమంగా ఉండాలని వీరబల్లె ఎస్ఐ చంద్రమోహన్ ఆటో డ్రైవర్లకు సూచించారు. మంగళవారం ఆయన వీరబల్లె పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్‌తోపాటు ఇన్సూరెన్స్, పొల్యూషన్ కార్డు, ఆర్‌సీ వంటి అన్ని రికార్డులు అన్ని తమ వద్ద ఉంచుకోవాలని తనిఖీ అధికారులు అడిగినప్పుడు చూపించాలని చెప్పారు. అలాగే డ్రైవింగ్ చేసేటప్పుడు అతివేగంగా నడపడం చాలా ప్రమాదని చెప్పారు. తనిఖీ సమయంలో సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేసే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు.

రైతులు వివరాలను అందజేయాలి

రామాపురం : 2023–24 సంవత్సరానికి సంబంధించి గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పండ్ల తోటల రైతులు బ్యాంక్ ఖాతా, ఆధార్, పాన్‌కార్డుల జిరాక్స్‌ను బుధవారం ఉపాధి కార్యాలయంలో అందజేయాలని ఏపీఓ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2023 – 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో మండల వ్యాప్తంగా 66 మంది లబ్ధిదారులకు సంబంధించి 262 ఎకరాలు పండ్ల తోటల పెంపకానికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. త్వరగా లబ్ధిదారుల సమాచారాన్ని వెండర్ ఐడియా కింద నమోదైతే బ్యాంకు ఖాతాలో నగదును జమ చేస్తామన్నారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించిన మూడు సంవత్సరాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, ఎకరాకు మూడు సంవత్సరాలకు రూ.1.05లక్ష చొప్పున జమ అవుతుందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం తొట్టివారిపల్లె సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. సీఎండీఎఫ్ గ్రాంట్ కింద సుద్దమళ్ల గ్రామానికి రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం సంతోషదాయకమన్నారు. సూరం వెంకటసుబ్బారెడ్డి, వెంకటరమణ, సుబ్బరాజు, రమణ, శ్రీరాములు, రమేష్ పాల్గొన్నారు.